

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 6,14,880
బంగారం: 800 మిల్లీ గ్రాములు
వెండి: 63 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొట్‌పాడ్‌లో నకిలీ ఎరువులు అమ్ముతున్నారని రైతులు చేస్తున్న ఆరోపణలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. - 8లో



వివాహిత ఆత్మహత్య

మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి టిగల్ పంచాయతీ కటమెట్ల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. - 8లో

న్యూస్‌రీల్

వైభవంగా వినాయక కల్యాణోత్సవం



గణనాథుడి కల్యాణం

రాయగడ: వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎద్దు వీధిలో బుధవారం వినాయక కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సిద్ధి బుద్ధి సమేత వినాయకున్ని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముత్తయిదువులకు అక్షింతలు అందించారు. బ్రహ్మాది రుషులు మునులు దంపతులను ఆశీర్వదించేలా ఏర్పాటు చేసిన బ్యానర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఏడో తేదీన మజ్జిగౌరి మందిరం మూసివేత



మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల ఏడో తేదీన మజ్జిగౌరి మందిరాన్ని మూసివేస్తున్నట్లు మందిర కమిటీ బుధవారం ఓ ప్రకటలో తెలియజేసింది. ఆ రోజున ఉదయం 11 గంటల వరకు మాత్రమే అమ్మవారి దర్శన భాగ్యం ఉంటుందని.. అనంతరం మందిరాన్ని మూసివేస్తామన్నారు. తిరిగి సామవారం తెల్లవారుజామున తెరుస్తామన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు



ఏకాదశి విశిష్టత గురించి వివరిస్తున్న రాంజీ ఆచార్యులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో బుధవారం పార్శ్వ ఏకాదశి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భాద్రపద శుక్ల ఏకాదశిని పరివర్తన ఏకాదశిగా పిలుస్తారు. ఈ రోజున మన ప్రకృతిలో మార్పులు సంభవిస్తాయని.. అందుకే ఈ ఏకాదశిని పార్శ్వ ఏకాదశి లేదా పరివర్తన ఏకాదశిగా పిలుస్తారని ఆచార్యులు భక్తులకు వివరించారు.

పాఠశాల గోడను ఢీకొట్టిన వ్యాన్

- డ్రైవర్‌కు గాయాలు



ప్రమాద దృశ్యం

రాయగడ: స్థానిక గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల గోడను ఒక వ్యాన్ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో వ్యాన్ ఒక వైపు పూర్తిగా ఒరిగిపోయింది. బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వచ్చిన వ్యాన్ పాత బస్టాండు వైపు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై మృతదేహం

రాయగడ: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి రైల్వే స్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద బుధవారం తెల్లవారున ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడుకి 55 ఏళ్ల వయసు ఉంటుందని.. అతని వివరాలు తెలియాల్సి ఉందని రైల్వే పోలీస్ వర్గాలు తెలిపాయి. ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్కళ క్యాంపస్‌లో ఉద్రిక్తత

- గేట్లకు తాళం వేసి విద్యార్థుల నిరసన
- అనధికార వ్యక్తులు చొరబడితే సహించం: మంత్రి



గోపబంధు హాస్టల వద్ద పోలీసులు

భువనేశ్వర్: స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం గోపబంధు హాస్టల్‌లో మంగళవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. వార్డెన్ చర్యలకు వ్యతిరేకంగా పలువురు విద్యార్థులు గేట్లకు తాళం వేసి నిరసన తెలిపారు. విద్యార్థేతర వర్గాలు హాస్టల్ ఖాళీ చేయాలని వార్డెన్ ఆదేశించడంతో ఈ ఉద్రిక్తత ఏర్పడింది. విశ్వవిద్యాలయ ప్రాంగణం నుంచి మురికివాడలను తొలగించాలని విద్యార్థేతర వర్గాలు ఎదురు దాడికి దిగాయి. ఈ వర్గాలు ఉద్దేశపూర్వకంగా విశ్వవిద్యాలయంలోని హాస్టల్‌లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించారు. స్థానిక సాహిద్ నగర్ ఠాణా పోలీసులు, మీడియా చొరవని అడ్డుకుని ఆందోళన కొనసాగించారు. వాణీవిహార్ ఉత్కళ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో తలెత్తిన ఉద్రిక్తతని ప్రేరేపించిన పరిస్థితులపై అధికారులు, అనుబంధ వర్గాలతో చర్చలు జరుగుతున్నాయని భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్ దేవదత్ సింగ్ తెలిపారు. అంతర్గత వ్యవహారాలతో ఈ ఉద్రిక్తత తలెత్తినట్లు ప్రాథమిక సమాచారం. పరిస్థితి అదుపు చేసేందుకు స్థానిక సాహిద్ నగర్ ఠాణా పోలీసుల బృందం ప్రవేశ ద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో నిరసనకారులు రాళ్లు రువ్వడంతో ప్రాంగణం లోనికి ప్రవేశించలేకపోయారు.

మురికివాడలు కూల్చండి..

ఉత్కళ క్యాంపస్‌లోనికి పరిసరాల్లో బీదలవాడ ప్రజలు అనధికారికంగా చొరబడి విద్యార్థులకు కేటాయించిన హాస్టలు గదుల్లో చొరబడ్డారు. వారందరినీ తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించడంతో బీదలవాడ వర్గీయులు భగ్గుమన్నారు. క్యాంపస్ పరిసరాల్లో మురికివాడ తొలగించిన తర్వాత ఆదేశాలు జారీ చేయాలని ఎదురు దాడికి దిగారు. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థుల 3 యూనిట్ల హాస్టలు గదుల్లో బీదల వాడ ప్రజలు అనధికారికంగా చొరబడి తిష్ట వేశారు. వారంతా ఈ నెల 4న లేదా అంతకు ముందు తమ వస్తువులతో సహా గదులను ఖాళీ చేయాలని హాస్టల్ వార్డెన్ ఆదేశించారు. ఆదేశాల ఉల్లంఘనకు పాల్పడిన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపడతామని స్పష్టంగా హెచ్చరించారు. మరో వైపు విద్యార్థి వర్గాలకు హాస్టలు వార్డెన్ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. హాస్టలు గదులను ఇతరులకు అద్దెకు కేటాయించడం నిషేధమని, ఈ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన విద్యార్థుల రిజిస్ట్రేషను పూర్తిగా రద్దు చేసి క్యాంపస్ నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

అనధికారిక చొరబాటులు సహించం..

విశ్వవిద్యాలయంతో సంబంధం లేని వారు క్యాంపస్‌లో అడుగుపెడితే సహించేది లేదని రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్ స్పష్టం చేశారు. క్యాంపస్‌లో ఆరోగ్యవంతమైన విద్యా వాతావరణం పరిరక్షణ పట్ల వైస్ చాన్సలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. బీదల వాడల ప్రజలు క్యాంపస్ లోనికి చొరబడడం తగదన్నారు.హద్దు మీరితే కఠిన చర్యలు చేపట్టడంలో వెనుకంజ వేసేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ విద్యార్థులకు అనుకూలంగా, వారి భద్రత కోసం నిబద్ధతతో వ్యవహరిస్తుందని చెప్పారు.

కొత్తగా 200 ఎంబీబీఎస్ సీట్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా స్థాపించబడిన ఫుల్బాణి, తాల్చేర్ మెడికల్ కాలేజీలకు 100 వంతున సీట్లు కేటాయించారు. ఈ మేరకు జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంసీ) ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో వైద్య విద్య కోసం మరో 200 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఎన్ఎంసీ తాజా ఆమోదం ప్రకారం ఫుల్బాణి ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 సీట్లు, తాల్చేర్ పవిత్ర మోహన్ ప్రధాన్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 సీట్లు లభించాయి. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఆయా కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమవుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు విస్తరించాయి. ఈ రెండింటితో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు 14కి చేరాయి. ఈ అభివృద్ధిని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ ఆమోదం ఆరోగ్య విద్య, ఆరోగ్య సేవలను బలోపేతం చేసే ఒడిశా ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొన్నారు. కొత్త సీట్లు ఈ సంవత్సరం నుంచి 200 మంది అదనపు ఒడియా విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి వీలు కల్పిస్తాయని తెలిపారు. ఆరోగ్య సంరక్షణను విస్తరించడానికి, భావి వైద్యులకు శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు చేతికొచ్చాయి

- బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా



సమావేశంలో జిల్లా ఎస్పీ జి.ఎన్.పండా, అదనపు ఎస్పీ సునీల్ కుమార్ మహంతి



పోగొట్టుకున్న వ్యక్తికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న జిల్లా పోలీసు అధికారులు



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు వాసికి పోగొట్టుకున్న మొబైల్‌ను అందిస్తున్న జిల్లా ఎస్పీ జి.ఎన్.పండా

పర్లాకిమిడి: పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి వారి చెంతకు చేరాయి. గత పది మాసాలుగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను జిల్లా సైబర్ పోలీసు విభాగం తమ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా వెతికి పట్టుకున్నారు. వీటిని బుధవారం రాణిపేటలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఉంచారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులను జిల్లా ఎస్పీ కార్యాలయానికి రప్పించారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా, అదనపు ఎస్పీ సునీల్‌కుమార్ మహంతి సమక్షంలో 40 మందికి వారి ఆండ్రాయిడ్ మొబైళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా మాట్లాడుతూ..2024–25 సంవత్సరంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైళ్లను బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఈ మిస్సింగ్ చరవాణులపై ఇకముందు కూడా నిఘా ఉంటుందన్నారు. త్వరలో మరి కొంతమంది బాధితులకు పోగొట్టుకున్న తమ సెల్‌ఫోన్లను అప్పగిస్తామని వివరించారు.

పాముకాటుతో బాలిక మృతి



బాలిక మృతదేహం

మల్కన్‌గిరి: పాముకాటుతో బాలిక మృతి చెందింది. మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి రోడస్‌పల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. బాలక భీమే సోడి (6) ప్రాణాలు కోల్పోయింది. గ్రామంలో మీర సోడి కుటుంబం నివసిస్తోంది. మంగళవారం రాత్రి భోజనాలు చేసిన తరువాత తల్లిదండ్రులతో కలిసి భీమే సోడి నిద్రపోయింది. అయితే విషసర్పం బాలిక కాలిపై కాటు వేసింది. దీంతో చిన్నారి కేకలు వేసి నిద్రపోయింది. బుధవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలోభీమే సోడి నోటివెంట చొంగ రావడంతోపాటు శరీరం అయిపోయినట్టు గమనించి తల్లి కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. వెంటనే బాలికను పోడియ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక చనిపోయినట్టు నిర్ధారించారు. పోడియ ఏఎస్సై అనిల్ మిశ్రో సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

శ్రీమందిరం పతాకంపై వాలిన డేగ..!



పతాకంపై ఉన్న డేగ

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం శిఖరాన నీలచక్రానికి అమర్చిన పతిత పావన పతాకంపై వాలిన డేగ కొద్ది సమయం నిలకడగా ఉండడం చర్చనీయాంశమైంది. ఇదో అసాధారణ ఘటనగా భక్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇటువంటి దృశ్యం వీడియో వైరల్ అయి కలకలం రేపింది.

ఆధ్యాత్మిక ప్రాముఖ్యత..

శ్రీ జగన్నాథుని ఆలయ శిఖరంపై శ్రీమహా విష్ణువు వాహనం డేగ వాలడం రక్షణతో కూడిన హెచ్చరికగా పరిగణించాలని ఆధ్యాత్మిక వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచానికి ఎదురు కానున్న సవాళ్ల గురించి ఇది ముందస్తు హెచ్చరిక. అలాగే దైవిక సంరక్షకత్వం ఉందని కూడా భరోసా ఇస్తుందని వివరించారు. జగన్నాథ ఆలయ శిఖరంపై డేగ ఉనికి అశుభం కాదు. అప్రమత్తంగా ఉండటం, భగవంతుని పట్ల విశ్వాసంతో లోతుగా ప్రార్థించడం, జగన్నాథుడు పర్యవేక్షిస్తూ రక్షిస్తున్నాడని విశ్వసించేందుకు సానుకూల శకునంగా కొంతమంది పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: స్థానిక మెయిన్ రోడ్డు వద్ద వ్యాపారుల సంఘం నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అనంత ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయాలకే పెద్దపీట



దాబుగాంలో జరిగిన సమావేశ వేదికపై కుసుం కుమార్, భుజబల్ మఝి, క్రిష్ణ కులదీప్, సాయిరాజ్

- ఏఐసీసీ పరిశీలకుడు కుసుం కుమార్



హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తల అభిప్రాయాలకే పెద్ద పీట వేస్తామని ఏఐసీసీ పరిశీలకుడు జెట్టి కుసుం కుమార్ (హైదరాబాద్) ప్రకటించారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం, కొసాగుమ్డ, పపడాహండి సమితి కేంద్రాలలో పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. కిందిస్థాయి నుంచి ప్రతి కార్యకర్త అభిప్రాయం పరిగణనలోనికి తీసుకోవడానికే రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖార్గేలు తనను పంపించారన్నారు. పార్టీ అధిష్టానం కిందిస్థాయి కార్యకర్తలకు పెద్ద పీట వేస్తుందన్నారు. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా కార్యకర్తల వద్దకే వెళ్లి సమితి అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు పదవుల ఎంపిక చేస్తున్నామన్నారు. కార్యకర్తలు ఎటువైపు మొగ్గు చూపితే వారే అధ్యక్షులు అవుతారన్నారు. ఇందులో ఎటువంటి లాబీలు గానీ, సిఫార్సులు గాని చెల్లవన్నారు.అధ్యక్షులు అయ్యే వారి గత చరిత్ర కూడా పరిగణలోనికి తీసుకుంటున్నామన్నారు. కొత్త అధ్యక్షులు రానున్న మూడంచెల పంచాయతీ ఎన్నికలు, తర్వాత పురపాలక ఎన్నికలో సత్తా చూపాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికలను ఎదుర్కొనే సత్తా ఉన్నవారికే అధిక ప్రాధాన్యం ఇస్తామని కుసుం కుమార్ ప్రకటించారు. మూడు సభలలో కార్యకర్తలతో విడివిడిగా మాట్లాడారు. వారితో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. తనదైన శైలిలో పార్టీలో గతంలో జరిగిన సంఘటనలు వెలికి తీశారు. ఈ సమావేశాల్లో మాజీ ఎంఎల్‌ఏ భుజబల్ మఝి, నాయకులు క్రిష్ణ కులదీప్, గెంబలి సాయిరాజ్ పాల్గొన్నారు.

గజపతి జిల్లాలో ప్రైవేటు మెడికల్ కళాశాల నిర్మించాలని వినతి



తిరుపతి పాణిగ్రాహికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి బిభూతీ జెన్నా, భాస్కర తీర్థ లక్ష్మీబాబా

పర్లాకిమిడి: ఒడిశాలో వెనుకబడిన ఆదివాసీ బహుళ గజపతి జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మించాలని రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖ మంత్రి బిభూతీ జెన్నా ప్రముఖ పారిశ్రామిక వేత్త, హైటెక్ మెడికల్ కళాశాలల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహినిని బుధవారం భువనేశ్వర్‌లో కోరారు. గజపతి జిల్లాలో అనేక మంది పేదరోగులు పొరుగున ఉన్న శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు సర్జరీలు కోసం వెళ్లి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పర్లాకిమిడి ప్రాంతంలో ప్రైవేటు మెడికల్ కళాశాలను నిర్మించాలని రాష్ట్ర మంత్రి బిభూతీ జెన్నా కోరారు. అలాగే పవిత్ర మహేంద్రగిరి పర్యాటక ప్రాంతం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేయనున్నట్టు మంత్రి జెన్నా తెలియజేశారు. రాష్ట్ర మంత్రి జెన్నాతో పాటు మహేంద్రగిరి పరిరక్షణ సమితి అధ్యక్షులు భాస్కర తీర్థ లక్ష్మీబాబా ఉన్నారు. జిల్లాలో ఆదివాసీ ప్రాంతాల్లో ఒక సంచార మెడికల్, అంబులెన్సు ఏర్పాటు చేయాలని భాస్కర తీర్థ లక్ష్మీ బాబా హైటెక్ మెడికల్ కళాశాల అధిపతి తిరుపతి పాణిగ్రాహిని కోరారు. రాష్ట్ర మంత్రి జెన్నా ప్రతిపాదనకు హైటెక్ మెడికల్ కళాశాల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి అంగీకరించారు. తప్పకుండా పర్లాకిమిడి లేదా పరిసర ప్రాంతంలో మెడికల్ కళాశాల నిర్మించడం జరుగుతోందని ఈ సందర్భంగా తిరుపతి పాణిగ్రాహి అన్నారు.

పూరీలో త్వరలో క్యూలైన్ దర్శనం



సమావేశమైన శ్రీ మందిరం కొత్త పాలక మండలి

- పార్లమెంటులో రథ చక్రాల ప్రదర్శన
- 14 ఉప సంఘాలు ఏర్పాటు
- శ్రీ మందిరం పాలక మండలి తొలి సమావేశంలో పలు నిర్ణయాలు

భువనేశ్వర్: కొత్తగా ఏర్పడిన పూరీ శ్రీ మందిర్ కమిటీ పాలక మండలి తొలి సమావేశం బుధవారం జరిగింది. పూరీలోని నీలాద్రి భక్త నివాస్ సమావేశం హాలులో గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గతంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీర్మానాల్ని ఆమోదించినట్లు ప్రకటించారు. భారత పార్లమెంట్ భవనం ఆవరణలో జగన్నాథ రథ చక్రాల ప్రదర్శనకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

ఉప కమిటీల ఏర్పాటు, భక్తుల కోసం క్యూ వ్యవస్థను అమలు చేయడం, రత్న భాండాగారంలో విలువైన ఆభరణాలు, నగలు, పాత్రలు తదితర అమూల్య సంపద నిర్వహణ, ధృవీకరణ వంటి అనేక కీలక అంశాలపై చర్చించారు. ఆలయ పాలన, భద్రత, ఆచారాలు సజావుగా సాగడానికి సంబంధించిన ఇతర ముఖ్యమైన విషయాలను చర్చించారు.

వరుస దర్శనం..

శ్రీమందిరం రత్నవేదికపై కొలువుదీరిన చతుర్ధా మూర్తుల్ని భక్తుల్ని దర్శించుకునేందుకు వరుస దర్శనం(క్యూలైన్) వ్యవస్థ ప్రతిపాదనకు కొత్త పాలక మండలి ఆమోదించింది. శ్రీ మందిరం లోపల నాట్య మండపం ప్రాంగణంలో దీని కోసం ప్రత్యేక వ్యవస్థ ప్రవేశ పెడతారు. తొలి దశలో లాంఛనంగా ఈ విధానం ప్రవేశ పెట్టాలని తీర్మానించారు. కలెక్టర్, ఎస్పీ, ఒడిశా వంతెనల నిర్మాణం సంస్థ, భారత పురావస్తు శాఖ నుంచి సమగ్రంగా ఐదుగురు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం వరుస దర్శన విషయాన్ని సమీక్షిస్తుంది. శ్రీ మందిర్ అభివృద్ధికి, భక్తులకు సజావుగా దర్శనం కల్పించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని ఆలయ పాలక మండలి సభ్యుడు సిద్ధేశ్వర్ మహాపాత్రో ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆలయంలోని వివిధ పనుల కోసం 14 ఉపకమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో కలెక్టర్ అధ్యక్షతన సంస్థాగత, జగన్నాథ్ తత్వ పరిశోధన, ప్రచురణ ఉప సంఘం, జగన్నాథ ఆలయ పెన్షన్ ట్రస్ట్ బోర్డు ఉప సంఘాలు, ఆలయంలో కళాత్మక శిల్పాల పరిశీలన కోసం సాంస్కృతిక ప్రాజెక్ట్ ఉప సంఘం, భూమి, ఆర్థిక, సేవలు, రత్న భాండాగారం, అప్పీల్ ఉప కమిటీలు ప్రధానమైనవిగా పేర్కొన్నారు. గిరీష్ చంద్ర ముర్ము చైర్మన్ అధ్యక్షతన ఆలయ రక్షణ కోసం తొలిసారిగా ఏర్పాటు చేసిన కొత్త ఉపసంఘంలో స్థానిక జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, సేవాయత్‌లు సభ్యులుగా ఉంటారు. దివ్యాంగుల సౌలభ్యానికి ఉత్తర ద్వారం వద్ద ర్యాంప్‌ల ఏర్పాటు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి డాక్టరు అరవింద కుమార్ పాఢి, పూరీ జిల్లా కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా, పోలీసు సూపరింటెండెంట్ ప్రతీక్ సింగ్‌తో పాటు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో ఆరుగురికి యావజ్జీవ శిక్ష



వివరాలు వెల్లడిస్తున్న ఏపీపీ సంతోష్ మిశ్రా

కొరాపుట్: ఒకే కుటుంబంలో ఆరుగురికి యావజ్జీవ శిక్ష పడింది. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర కోర్టుల సముదాయంలో అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి బిష్ణు ప్రసాద్ మిశ్రా ఈ తీర్పును వెలువరించారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున వాదించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోష్ మిశ్రా విలేకరులకు వివరాలు వెల్లడించారు. నబరంగ్‌పూర్ జిల్లా కొడింగా పోలీస్‌స్టేషన్ పరిధిలో బరమసి గ్రామంలో 2022 ఆగస్టు 9న పొలం పని చేసుకుంటున్న డొంబురు పూజారి (40) కుటుంబంపై అదే గ్రామానికి చెందిన అనంత పూజారి కుటుంబ సభ్యులు ఆయుధాలతో వచ్చి దాడికి పాల్పడ్డారు. పదలం పూజారి అనే వ్యక్తిని ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపడానికి ప్రయత్నించారు. మహిళలు, పిల్లలపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గాయపడ్డ డొంబురును నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కటక్‌లో ఎస్‌బీసీ మెడికల్ కాలేజికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డొంబురు మృతి చెందాడు. మిగిలిన బాధితులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ ఘటనకు కారకులైన అనంత పూజారి, శివశంకర్ పూజారి, చందన్ పూజారి, డుమర్ పూజారి, దాలింబు పూజారి, మైనర్ బాలుడికి యావజ్జీవ శిక్ష విధించారు.

క్లుప్తంగా

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా రమేష్


రమేష్‌రావు (చిన్ను)

కొరాపుట్: జయపూర్ విధాన సభ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎ.రమేష్ రావు (చిన్ను) నియమితులయ్యారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రో కొన్ని జిల్లాలకు సంబంధించి విధాన సభ యువజన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. అందులో రమేష్ పేరు కూడా ప్రకటించారు. గత 15 సంవత్సరాలు జయపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో రమేష్ సేవలు అందిస్తున్నారు. రమేష్‌ను జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహీణిపతి, కొరాపుట్ జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ భగవాన్ భాహీణిపతి అభినందించారు.

ఉప్పొంగిన గుమ్మగెడ్డ


ఉధృతంగా ప్రవహిస్తున్న గుమ్మగెడ్డ

పర్లాకిమిడి: గత వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు రాణిపేట రోడ్డులో గల గుమ్మగెడ్డ పొర్లి పొంగుతోంది. పర్లాకిమిడి నుంచి గుమ్మగెడ్డ వరదనీరు ఆంధ్రప్రదేశ్‌లోని పాతపట్నం మండలంలో గల బైదలాపురం, రోంపివలస, అనంతగిరి గ్రామాలకు ప్రవహిస్తోంది. గజపతి జిల్లాలో వంశధార, మహేంద్రతనయ నదులు కూడా వరదనీరుతో నిండడంతో రైతులు ఉభాలకు సిద్ధమవుతున్నారు.

సహాయక చర్యల్లో ఎలైట్ కే9 స్క్వాడ్

భువనేశ్వర్: రాష్ట్ర అగ్నిమాపక విభాగం సహాయక చర్యల్లో ఎలైట్ కే9 స్క్వాడ్ మోహరించారు. శోధన, రక్షణ వంటి కీలక కార్యకలాపాల్లో పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సిబ్బందికి సహాయకంగా కే9 జాగిలాల ప్రత్యేక బృందం గుర్తింపు పొందింది.

ఆదిత్యుని సన్నిధిలో ప్రభాస్ శ్రీను


ఆలయం వెలుపల స్నేహితులతో ప్రభాస్ శ్రీను

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారిని సినీ నటుడు పీరు శ్రీనివాస్ (ప్రభాస్ శ్రీను) బుధవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులతో పాటు నరసన్నపేటలో వినాయక చవితి మహోత్సవాలకు హాజరైన ప్రభాస్ శ్రీను.. ఆదిత్యున్ని దర్శించుకొని ఆలయ విశేషాలను స్నేహితులకు వివరించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, సాందీప్‌శర్మల బృందం వారికి వేదాశీర్వచనాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధలు కోరారు. శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ పీడీ ఐ.విమల అధ్యక్షతన జిల్లాలోని 16 ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పీడీ విమల దృష్టికి తీసుకొచ్చారు. పీడీ విమల మాట్లాడుతూ.. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, రాష్ట్ర స్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రీస్కూల్ పిల్లల శాతం పెంచాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు పరిశుభ్రంగా ఉన్నదీ.. లేనిదీ సమీప సచివాలయాల్లో పరీక్ష చేయించి, ఆ నివేదికలను ప్రతివారం తనకు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులందరికీ సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్‌ల నాయకులు కె.సుజాత, పి.లతాదేవి, జె.కాంచన, బి.శాంతమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలి

సోంపేట: స్వయం శక్తి సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలని డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మూలపొలం గ్రామంలో సముద్రపు నాచు పెంచే విధానంపై మత్స్యశాఖ, సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సముద్రపు నాచుతో అధిక ఆదాయం పొందవచ్చునని తెలియజేశారు. గతంలో చేపల పెంపకం నిర్వహిస్తున్న మహిళలు, ప్రస్తుతం సముద్రపు నాచు పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు.

రామనగుడలో కలెక్టర్ పర్యటన


కుజేంద్రీలో పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అశుతోష్

రాయగడ: జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి రామనగుడలో బుధవారం పర్యటించారు. సమితి పరిధిలో గల వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఇందులో భాగంగా సమితి పరిధిలోని కొరడ గ్రామంలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న చింతపండు ప్రక్రియకరణ కేంద్రాన్ని పరిశీలించారు. వారితో కాసేపు మాట్లాడారు. దీని ద్వారా వారు పొందుతున్న లాభాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖంబాగుడలో పర్యటించిన ఆయన స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు సాగు చేస్తున్న గులాబీ తోటలను పరిశీలించారు. మహిళల ఆర్థిక సార్థికారతకు తోడ్పడుతున్న వీటిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రామనగుడలో ఈ– లైబ్రరీ, గొసాయి గులుముండలో ఇండ్రస్ట్రియల్ పార్క్‌ను సందర్శించారు. కుజేంద్రి గ్రామీణ పార్క్‌లో కాసేపు గడిపి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎమాడింగొలో నిర్మితమవుతున్న వంతెనను పరిశీలించారు. పనులపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. రామనగుడ బీడీఓ ప్రద్యుమ్న కుమార్ మండ్, తహసీల్దార్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి, సమితి అధ్యక్షుడు రవినారాయణ గొమాంగొ, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను సరళీకరణతో మేలు


ప్రసంగిస్తున్న రాంప్రసాద్. వేదికపై గంగరాజు తదితరులు

రాయగడ: ఆదాయపు పన్ను 1961 చట్టం సరళీకరణ చేయడంతో సీనియన్ సిటిజన్లకు ఎంతగానో మేలు చేకూరుతుందని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బరాటం రాంప్రసాద్ అన్నారు. స్థానిక ఆదాయపుపన్ను కార్యాలయంలో బుధవారం 'ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు' అనే అంశం సంబంధిత శాఖాధికారి టి.గంగరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఆర్ సమర్పించేందుకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈక్విటీ పెట్టుబడులు, దీర్ఘకాలిక లాభాలు, మూలధన పాదుపుపై పన్ను స్లాబ్‌లను వివరించారు. అధిక ఆదాయం సంపాదిస్తున్న వారు సకాలంలో పన్నులు చెల్లిస్తే దేశ ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బరంపురం ఆదాయపు పన్ను విభాగం అధికారి రూపేష్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య


కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద రామే మాడ్కమి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి టిగల్ పంచాయతీ కటమెట్ల గ్రామానికి చెందిన రామే మాడ్కమి (50) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. కనిమెట్లలో నివాసం ఉంటున్న పెంట మాడ్కమి భార్య మంగళవారం రామే మాడ్కమి రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసింది. అందరూ నిద్రపోయిన తరువాత వ్యవసాయం కోసం తెచ్చిన పురుగు మందును తాగింది. నిద్ర మధ్యలో లేచిన భర్త చూసి కిందపడి ఉన్న భార్యను చూశాడు. వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఎం.వి–79 పోలీస్ ఐఐసీ కృష్ణకాంత్ తండి ఆరోగ్య కేంద్రానికి చేరుకొని కేసు నమోదు చేశారు. భర్తను విచారించగా.. ఎందుకు ఇలా జరిగిందో తెలియదన్నాడు. ఆమె మృతిపై దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఐఐసీ తెలిపారు.

440 కిలోల గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు ఖోయిర్‌పూట్ సమితి సునగార్ గ్రామ అడవిలో ముందస్తు సమాచారంతో దాడులు చేపట్టి 440 కిలోల గంజాయిని మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్న సమయంలో పోలీసులకు గంజాయి అక్రమ రవాణపై అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్ సమాచారం వచ్చింది. దీంతో బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయక్ ఎస్‌ఐ అజిత్‌తో పాటు ఓ బృందం సునగార్ గ్రామానికి చేరుకున్నారు. సమాచారం ప్రకారం పోలీసులు గాలించగా ఓ చోట 18 సంచుల్లో గంజాయి దొరికింది. పోలీసుల రాకను గమనించిన మాఫీయా అక్కడ నుంచి పరారైంది. పట్టుబడ్డ గంజాయిని బలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. బుధవారం తూకం వేయగా 440 కిలోలు ఉందని.. దీని విలువ సుమారు రూ. 30 లక్షలు ఉంటుందని ఐఐసీ దీరాజ్ పట్నాయక్ చెప్పారు. కేసు నమోదు చేసి పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నామన్నారు.


అండర్ పాసేజ్‌తో అవస్థలు


రైల్వే అండర్ పాసేజ్‌లోకి చేరిన వర్షపు నీరు


ట్రాక్ దాటి వెళ్తున్న పాఠశాల విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలంలోని కవిటి అగ్రహారం గ్రామానికి చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే అండర్ పాసేజ్‌లోకి వరద నీరు ఆరు అడుగుల మేర చేరిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు స్థానిక రైల్వే ట్రాక్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. తమ గ్రామానికి వెళ్లేందుకు పాత లెవెల్ క్రాసింగ్ రహదారిని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. రైల్వేశాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అండర్ పాసేజ్ నిర్మాణం పూర్తిగా ఫెయిల్ అయిందని, ముందుచూపు లేకుండా నిర్మించారని మండిపడ్డారు. వర్షాకాలం వస్తే ఇదే పరిస్థితి ఉంటోందని, చిన్నపాటి వర్షానికే అండర్ పాసేజ్ నిండిపోయి రాకపోకలు నిలిచిపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు రైలు ట్రాక్ దాటి చిన్నారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, దీనివలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు, రైల్వే శాఖ అధికారులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి వచ్చి గ్రామస్తులతో చర్చలు జరిపారు. మూడు రోజుల్లో సమస్య పరిస్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. పెద్ద మోటార్లు తీసుకొచ్చి అండర్ పాసేజ్‌లో నీటిని తోడే ప్రయత్నాలు రైల్వేశాఖ అధికారులు ముమ్మరం చేశారు.

ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం


గుప్త(ఫైల్)

నరసన్నపేట: స్థానిక లక్ష్మన్నపేటకు చెందిన వ్యాపారి వెంకట పార్వతీశం గుప్త ఆచూకీ కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు నరసన్నపేట సీఐ ఆఫీస్‌లో మకాం వేసి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచీ డీఎస్పీ నరసన్నపేటలోనే ఉన్నారు. వినాయక చవితి ముందు రోజు ఈనెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గుప్త ఇంత వరకూ ఇంటికి రాలేదు. దీంతో నరసన్నపేట పోలీసులకు గుప్త సోదరుడు మన్మథరావు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మొదట్లో కేసు నమోదు చేయడంలో స్థానిక పోలీసులు జాప్యం చేశారు. ఆ తర్వాత మాత్రం కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి ఎస్‌ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్, రంజిత్‌లతో పాటు సిబ్బంది దర్యాప్తులో భాగస్వాములయ్యారు.

సీసీ ఫుటేజీ పరిశీలన

జాతీయ రహదారిపై, టోల్‌గేట్లు వద్దనున్న సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. అదేరోజు సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటల సమయంలో తిరుగు ప్రయాణం అయినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి కారులో డ్రైవర్ తప్ప గుప్త లేరని సమాచారం. ఈ మేరకు మడపాం టోల్‌గేట్ సీసీ ఫుటేజీతో పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే గుప్తను నరసన్నపేటలో దించానని డ్రైవర్ చెప్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో డ్రైవర్‌ను అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. బంగారు ఆభరణాలు తీసుకురావడానికి కారులో విశాఖ వెళ్లిన గుప్త, కేజీకి పైగా బంగారు ఆభరణాలు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారని తెలుస్తోంది. తిరుగు ప్రయాణంలో గుప్త ఏమయ్యారో.. బంగారు ఆభరణాలు ఏమయ్యాయి అనేది తెలియడం లేదు.

చంద్రగ్రహణం వేళ ఆంక్షలు

భువనేశ్వర్: చంద్ర గ్రహణం సందర్భంగా పూరీ జగన్నాథుని దేవస్థానంలో సేవలు, పూజాదులకు సంబంధించి కార్యక్రమాలు ఖరారు చేశారు. ఈ మేరకు పూరీ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఛొత్తీషా నియోగుల సమావేశం బుధవారం జరిగింది. 7వ తేదీ మధ్యాహ్నం 12.57 గంటల నుంచి వంటలు, పూజా కార్యక్రమాలు నిలిపివేస్తారు. రాత్రి 9.57 గంటలకు గ్రహణ స్పర్శ, అర్ధ రాత్రి 1.27 గంటలకు గ్రహణ విముక్తి అనంతరం రాత్రి 2 గంటలకు గ్రహణ శుద్ధి కార్యకలాపాలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ఛొత్తీషా నియోగి మహానాయక్, సేవాయత్ ప్రతినిధులు, పాలనాధికారులు పాల్గొన్నారు.

జాజ్‌పూర్‌లో అతిసార

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో అతిసార విజృంభించింది. బొడొచొణ మండలంలో పరిస్థితి తీవ్రంగా ఉండటంతో తొలొచువా అనే వ్యక్తి మృతి చెందాడు. ఈయన కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతు మరణించాడు. మరో 10 మంది వ్యాధి బారిన పడ్డారు. ఇటీవలే ఈ ప్రాంతంలో అతిసార బీభత్సం విజృంభించింది. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు. ప్రత్యేక వైద్య బృందాల్ని ప్రభావిత ప్రాంతాలకు పంపించినట్లు చెప్పారు. అనుబంధ ప్రయోగశాల పరీక్షలు నిర్వహించి 3 రోజుల్లోగా వివరణాత్మక నివేదికను సమర్పించాలని ప్రధాన జిల్లా వైద్య అధికారి (సీడీఎంఓ)కి ఆదేశించారు.

వృద్ధుడు ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని పిషిణి గ్రామానికి చెందిన వృద్ధుడు యందువ రామునాయుడు (75) గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు జేఆర్‌పురం పోలీసులు, స్థానికులు తెలిపారు. అనారోగ్య కారణాలతో బాధపడుతున్న రామునాయుడు బుధవారం ఉదయం ఇంటి వద్ద గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

వేరుశనగ రైతులకు డబ్బులు చెల్లించాలి


లేంప్స్ కార్యాలయం ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి మండీలో వేరుశనగ కాయలు (చీనా బాదమ్) విక్రయించి మూడు నెలలు గడచినా లేంప్స్‌వారు డబ్బులు చెల్లించ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ తెలియజేశారు. లేంప్ కార్యాలయానికి ఎమ్మెల్యే బుధవారం వెళ్లారు. వేరుశనగ రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని, లేకపోతే లేంపు కార్యాలయానికి తాళాలు వేస్తామని అధికారులను హెచ్చరించారు. బొయిపరిగుడ సమితి బొదాపుట్, దసమంతపూర్ పంచాయతీల్లో వందలాది మంది రైతులు వేరుశనగ పంట పండిస్తున్నారు. వేరుశనగ పంట పండిన తరువాత మూడు నెలల కిందట బొయిపరిగుడ లేంప్స్ మండీలో అమ్మారు. మండీలో అమ్మిన 24 గంటలలో రైతుల బ్యాంక్ ఖాతాలలో డబ్బులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలున్నాయి. బొయిపరిగుడ లేంప్స్ అధికారులు మూడు నెలలు గడచినా డబ్బులు వేయలేదు. రైతులు ఎన్ని పర్యాయాలు లేంప్స్ అధికారులను కలిసి డబ్బులు చెల్లించాలని విజ్ఞప్తులు చేసినా వినిపించుకోవటం లేదని ఆరోపించారు. గత కలెక్టర్ నిర్వహించిన వినతుల శిబిరంలో ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. కుసపార, పకులి, పొడా, బారువ, పాత్రగుడ, దొరాగుడ తదితర గ్రామాల రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నా నేటివరకు లేంప్స్ వారు రైతులుకు డబ్బులు చెల్లంచలేదు. ఆఖరికి కొరాపుట్ ఎమ్మెల్యే బొయిపరిగుడ లేంప్స్ కార్యాలయానికి వచ్చి ఎండీ రబినారాయణ మిశ్రను కలిశారు. ఏ జిల్లాలో కూడా ఇటువంటి సమస్య లేదని, ఎందుకు బొయిపరిగుడ సమితిలో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఎండీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వెంటనే రైతులుకు వారి ఖాతాల్లో డబ్బులు వేయాలని, లేకపోతే లేంప్స్ కార్యాలయానికి తళాలు వేస్తామని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువులను పరిశీలిస్తున్న అధికారి

జయపురం: జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్‌లో నకిలీ ఎరువులు అమ్ముతున్నారని రైతులు చేస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించారు. రంగులు వేసిన, మట్టి కలిపిన ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు కొందరు అలా రంగులు వేసిన ఎరువులను చూపించారు. జిల్లా కలక్టర్, జిల్లా వ్యవసాయ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని రైతులు తీసుకెళ్లారు. లైసెన్స్‌లు లేకుండా నకిలీ ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నకిలీ ఎరువులు అమ్ముతున్న దుకాణాదారులను గుర్తించి వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్, వ్యవసాయ అధికారులు హామీ ఇచ్చారు. ఆరోపణలు ఉన్న దుకాణాలపై బుధవారం అధికారులు దాడులు నిర్వహించారు. నకిలీ ఎరువులు అమ్ముతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేసి షాపులు సీజ్ చేశారు. ఇది ఇలా ఉండగా కొద్ది రోజుల కిందట బొరిగుమ్మ, తదితర ప్రాంతాల్లో తహసీల్దార్, వ్యవసాయ అధికారులు నకిలీ ఎరువులు అమ్ముతున్న దుకాణాలపై దాడులు నిర్వహించారని, మూసి ఉన్న షాపులకు తాళాలు వేశారని, వ్యాపారుల గొదాములపై దాడులు జరపలేదని రైతులు ఆరోపిస్తున్నారు. షాపులతోపాటు గొదాముల్లో దాడులు జరిపి ఎరువులను పరీక్షించాలని, నకిలీ ఎరువులు బయట పడితే ఆయా గిడ్డంగుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆహార కమిషన్ సభ్యుల పర్యటన


అనుకుండగూడ ఆశ్రమ పాఠశాల వద్ద ఫుడ్ కమిషన్ సభ్యులు

పర్లాకిమిడి: ఒడిశా ప్రభుత్వ ఆహార కమిషన్ సభ్యులు జిల్లాలోని గుమ్మ, మోహనా సమితి కేంద్రాల్లోని పలు గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ ఆహార కమిషన్ బృందంలో సభ్యులుగా ప్రియ బ్రత సామంతరే, అక్షయ కుమార్ బెహరా, దయానిధి దాస్ ఉన్నారు. వీరు గుమ్మాలో అంగన్‌వాడీ కేంద్రం, ఆశ్రమ పాఠశాల, బరుంసింగిలో అంగన్‌వాడీ, భుబునీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెరంగోలో పుట్టగొడుగుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జాతీయ ఆహార భద్రత, రాష్ట్ర ఆహార భద్రత పథకంలో ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆహార భద్రత పథకం కింద ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మిడ్ డే మీల్ అందించటంలో అధికారులు ముందుండాలని సూచించారు. ఈ బృందం పర్యటనలో సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని మనోరమా దేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బిష్ణుచరణ్ పరిడా, అదనపు సీఎస్‌ఓ సుమాన్ భోంయి, సవ్యసాచి బోస్తియా, గుమ్మా సమితి చైర్మన్ సునేమీ మండల్, బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భద్రం బీ కేర్ ఫుల్ బ్రదరూ..!

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలు
- అప్రమత్తంగా లేకుంటే ఖాతాలు ఖాళీ



శ్రీకాకుళం క్రైమ్: పెరుగుతున్న సాంకేతికతతో పాటు రోజురోజుకీ సైబర్ మోసాలు పెచ్చుమీరుతున్నాయి. రోజుకో మోసంతో సైబరాసురులు రూ.కోట్లలో భారీగా సొమ్ము కొల్లగొడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు పట్టిపీడించిన ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలే ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి. ప్రముఖ వైద్యులు, ఉపాధ్యాయ, రాజకీయ, వ్యాపారవర్గాలు, ఇంజినీర్లు సైతం సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకొని దారుణంగా మోసపోతున్నారు. మోసపోయాక పరువు పోతుందేమోనని కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోయినా.. మరి కొందరు భారీ అమౌంట్లు కావడంతో నేరుగా జిల్లా ఉన్నతాధికారి వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ లెక్కకు మించి సైబర్ కేసులు వివిధ స్టేషన్లలో పెండింగ్‌లోనే ఉంటున్నాయి. మరికొన్ని స్టేషన్లలో అయితే కనీసం కేసు కట్టడానికి సాహసించలేని స్థితిలో ఉండడం గమనార్హం.

నమ్మారో.. నట్టేటా మునిగినట్లే..

☛ శ్రీకాకుళం సబ్ డివిజన్ కేంద్రంగా ఇటీవల ఒక ప్రముఖ వైద్యుడు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.37.50 లక్షలు మోసపోయాడు. ఎప్పటినుంచో స్టాక్ మార్కెట్‌లోనే కాకుండా వివిధ మార్గాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న ఆ వైద్యుడికి ఒక అపరిచిత వ్యక్తి వాట్సాప్ కాల్‌చేసి చిట్కాలు చెబుతాననడంతో సరే అన్నాడు. ముందుగా ఓ గ్రూపు క్రియేట్ చేసి అందులో సభ్యులను పరిచయం చేశాడు. రూ.10 లక్షలు పెడితే అదనంగా మరో రూ.10 లక్షలు వస్తుందని, రూ.20 లక్షలు పెడితే రూ.20 లక్షలు, రూ.30 లక్షలు పెడితే రూ.30 లక్షలు వస్తుందని మాయమాటలు చెప్పాడు. తన చిట్కాల ద్వారా గ్రూపులో సభ్యులకొస్తున్న అమౌంట్ స్క్రీన్‌షాట్లు తీసి వైద్యుడికి పెట్టసాగాడు. నమ్మకం కుదిరాక వైద్యుడు పలుమార్లు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు.. ఇలా వేస్తూనే ఉన్నాడు.. విత్‌డ్రా ఆప్షన్‌లో డబ్బులు అదనంగా కనిపిస్తుండడం తన అకౌంట్‌లో యాడ్ అవుతున్నట్లు ఆశ పుట్టింది. అలా ఒక రూ.15 లక్షల వరకు వేశాడు. డబ్బులైతే ఆప్షన్‌లో కనిపించి విత్ డ్రా అవ్వకపోవడంతో అపరిచిత వ్యక్తిని అడగగా.. మీరు కడుతుంటే ఒకేసారి వస్తాయనడంతో రూ.37 లక్షల వరకు కట్టేశాడు. కానీ అప్పటికీ విత్ డ్రా అవ్వకపోవడంతో పాటు అపరిచిత వ్యక్తికి ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. గ్రూపులో కూడా వైద్యుడిని రిమూవ్ చేసేశారు. ఇక చేసేదేమీలేక వైద్యుడు పోలీసులను ఆశ్రయించాడు.

☛ ఇదే తరహాలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఆర్మీకి చెందిన ఒక వ్యక్తి రూ.కోటికి పైగా సైబరాసురుల చేతిలో నష్టపోయానని ఫిర్యాదు చేయడంతో భారీ అమౌంట్ కావడంతో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నా.. ఇప్పటివరకు కేసు అయితే నమోదు చేయలేకపోయారు.

☛ రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన దుంప కృష్ణ చిత్తూరు జిల్లా మెట్టూరు ఎస్‌బీఐలో ఒప్పంద ఉద్యోగిగా చేస్తున్నాడు. వాట్సాప్ ద్వారా వచ్చే వీడియోలు చూసి సబ్‌స్క్రైబ్ చేసుకున్న కృష్ణకు సైబర్ కేటుగాళ్లు టెలిగ్రామ్ ద్వారా లింకులు పంపించి గేమ్‌లు ఆడించారు. బహుమతులు, డబ్బులొస్తున్నట్లు ఆన్‌లైన్‌లో చూపించడంతో కృష్ణ రూ.11.50 లక్షల వరకు ట్రేడింగ్ చేశాడు. చివరికి డబ్బులు ఎంతకీ అకౌంట్‌లో పడకపోవడంతో జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో అఫైర్ నమోదు చేసి చిత్తూరు జిల్లా మెట్టూరుకు కేసు బదిలీ చేశారు.

కేసులు నమోదు చేయలేని స్థితి

ఈ తరహానే కాకుండా వివిధ సైబర్ మోసాలపై జిల్లాలో భారీస్థాయిలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక్కో స్టేషన్‌లో 4 నుంచి 6 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మోసం చేసే కేటుగాళ్లు వివిధ రాష్ట్రాలు, దేశాలు వారు కావడంతో అక్కడికి వెళ్లి ఆ అధికారులతో సమన్వయం చేసుకుని నోటీసులిచ్చే వరకే చేయగలుగుతున్నారు. ఈలోగా దారి ఖర్చులు, వసతి ఖర్చులు అన్నీ వీరి పైనే భారంగా పడుతున్నాయి. పోనీ కోర్టు వరకు నేరస్తులు వస్తున్నారంటే అదీ లేదు. ఒకట్రెండు సార్లు వచ్చీ ఆ తర్వాత వారి జాడే కనిపించనంతగా మాయమవుతున్నారు. దీంతో ఇటువంటి కేసులు కట్టాలంటేనే తమకు తలనొప్పిగా మారుతున్నాయంటూ కొంతమంది పోలీసు అధికారులే చెబుతుండడం శోచనీయం.

అత్యాశే కారణం



ప్రస్తుతం సైబర్ నేరాలు జిల్లాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ప్రజలు అత్యాశతో వారి వలలో పడుతున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు వంటి మోసాలకు ఎక్కువగా చదువుకున్నవారే బలవుతున్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో గతంలో కంటే ఇప్పుడు కేసులు ఎక్కువగా నమోదు చేస్తున్నాం. క్షణాల్లో సైబర్ సెల్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసి పోలీసులను, బ్యాంకు ప్రతినిధులను సంప్రదిస్తే మంచిది.

– డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం

క్లుప్తంగా

మహిళపై మద్యం కేసు నమోదు



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న సీఐ రవికుమార్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో అనధికారంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ బుధవారం తెలియజేశారు. అనధికారంగా ఆమె కలిగి ఉన్న 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనధికార మద్యం అమ్మకాలు చేసినట్లయితే సమాచారం ఇవ్వాలని కోరారు. అనధికార మద్యం దుకాణాల వద్ద మద్యం కొనుగోలు చేయవద్దని సూచించారు. దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది మహేష్, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాలుడికి తప్పిన పెనుప్రమాదం



విద్యుత్ షాక్ తగిలిన బాలుడు రోహిత్

కొమరాడ: మండలంలోని ఆర్తాం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి డొల్లు రోహిత్‌కి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల లో 4 వతరగతి చదవుతున్న రోహిత్ రహదారి పక్కనే ఓ భవనం పైకి వెళ్లి ఆడుకుంటుండగా పక్కనే 11 కేవీ వైర్ తగలి కుడి చెయ్యి మొత్తం కాలిపోయింది. అదృష్టవశాత్తు ప్రాణానికి ప్రమాదం జరగలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. 11 కేవీ వైర్లు ఉన్నప్పటికీ భవనం నిర్మాణం కోసం అధికారులు అనుమతులు ఇవ్వడంతో స్థానికులు మండిపడుతున్నారు.

పశువుల లారీ సీజ్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస వద్ద 32 పశువులతో వెళ్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై జి.రాజేష్ బుధవారం తెలిపారు. రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు పశువులతో లారీ వస్తోందని కొంత మంది వ్యక్తులు ముందుగా సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

15న గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి మన్మథరావు

పార్వతీపురం: గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డా.ఎస్.మన్మథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) ధరను రూ. 500నుంచి రూ.150కు తగ్గించిందని చెప్పారు. ఈ వీర్యం వల్ల 90శాతంవరకు ఆడదూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. దీనిపై పాడి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ డా.దీనకుమార్, డా.మాణిక్యరావు, డా.శ్రీనివాసరావు, డా.బి.శ్రీనివాస్, డా.శ్రీసంధ్య పాల్గొన్నారు.

బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దుకు డిమాండ్



కలెక్టర్ కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని చూపిస్తున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్‌ను రద్దుచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వెలగవలస చెరువును గ్రానైట్ బూడిదతో నింపేసి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు పాడి బంగారిదొర మృతికి గ్రానైట్ కంపెనీయే కారణమని ఆరోపించారు. బంగారిదొర కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసి యజమానిని అరెస్టు చేయాలని కోరారు.

పడవే ఆధారం

కొమరాడ మండలంలోని నాగావళి నదికి ఆవల తొమ్మిది పంచాయతీల పరిధిలో 33 గ్రామాల ప్రజలు నివాసం ఉంటున్నారు. వీరంతా రోజువారీ పనులకు నాగావళి నదిని దాటుకుని రావాల్సిందే. పడవ ప్రయాణమే వీరికి ఆధారం. నది ఉద్ధృతంగా ప్రవహించే సమయంలో బాహ్య ప్రపంచంతో వీరికి సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. పూర్ణపాడు-లాభేసు వంతెన పూర్తయితే ఈ ప్రాంతాల్లోని సుమారు 20 వేల మందికిపైగా ప్రయోజనం.



నాగావళి నదిపై కొమరాడ-కొట్టు గ్రామాల మధ్య పడవ ప్రయాణం

చినుకు పడితే..

ప్రయాణానికి చింతే..

- మన్యం ప్రజలను వీడని వరద కష్టాలు
- నదులు, గెడ్డలు పొంగితే రాకపోకలు బంద్
- విద్యార్థులకు, గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

వర్షం కురిస్తే చాలు.. మన్యం ప్రజలు వణుకుతారు. నదులు, వాగులు దాటి స్కూల్‌కు వెళ్లిన చిన్నారులు.. కూలి పనులకు వెళ్లిన పెద్దలు తిరిగి ఇంటికి చేరేవరకు బిక్కుబిక్కుమంటూ గడుపుతారు. ఇక్కడ చినుకు రాలినా.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా వారికి భయమే. సరైన రహదారులు లేక.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నదులు, వాగులు, వంకలు దాటుకుంటూ ప్రయాణాలు చేయడం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. చాలా వరకు నదులపై వంతెనలు లేకపోవడం, చిన్నపాటి వరదలకే కల్వర్టులు, కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో ప్రధానంగా గిరిజనులు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. గర్భిణులు, రోగులను డోలీలు కట్టి, వాగుల మీదుగా తీసుకెళ్లిన ఘటనలు అనేకం. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 50 వరకు వంతెనలు, కాజ్‌వేలు, కల్వర్టులు అవసరమని గిరిజన సంక్షేమశాఖ అధికారుల అంచనా. నిధులు లేక మధ్యలోనే ఆగిపోతున్నవి కొన్ని వారధులు కాగా.. నిధులు కోసం చూస్తున్నవి మరికొన్ని ఉన్నాయి.



పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీలో గెడ్డ దాటి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

- ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 96 కిలోమీటర్ల మేర నాగావళి ప్రవహిస్తోంది. ఎగువన వర్షాలకు నది ఉద్ధృతంగా ప్రవహిస్తే ఆవలున్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు సాగించే క్రమంలో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. గతేడాది పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు ఇద్దరు గెడ్డ దాటుతుండగా ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పశువులు కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి.
- కురుపాం మండలం గొట్టివాడ గ్రామస్తులు మార్గమధ్యంలోని బోరిగెడ్డ దాటి ఏ పనికైనా ఇటు రావాల్సిందే.
- సీతంపేట మండలం రేగులగూడ-వెంపలగూడ మధ్య ప్రయాణం వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతోంది. వానలు కురిస్తే వాగు పొంగి, సమీప ప్రాంతాలకు రాకపోకలు తెగిపోతున్నాయి.
- భామిని మండలం కొరమ సమీపంలోని బగ్గామ త్రిపాడు గెడ్డపై ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన వంతెన 2002లో కూడిపోయింది. తర్వాత ప్రత్యామ్నాయంగా రూ.16 లక్షల వ్యయంతో కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. భారీ వర్షాలు కురిస్తే వాగు ఉద్ధృతంగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.
- మెంటాడ మండలం జగన్నాథపురం వద్ద చంపావతి నదిపై నిర్మించిన కల్వర్టు వర్షాల సమయంలో కొట్టుకుపోవడం సాధారణంగా మారింది. ప్రస్తుతం కూడా వర్షాలకు నది ప్రవాహం ధాటికి దెబ్బతింది. దీంతో జగన్నాథపురం, చాకివలస గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీ సందివలస గ్రామం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే గెడ్డ దాటాల్సిందే. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు భయంభయంగానే వెళ్తున్నారు.

- ఒడిశాలో వర్షాలు కురిస్తే సాలూరు నియోజకవర్గంలో సువర్ణముఖి నది ఉద్ధృతి పెరిగి సమీప గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్ అవతున్నాయి. దండిగాం వద్ద గతంలో వాహనాలు కూడా కొట్టుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇక్కడి కాజ్‌వే స్థానంలో డబుల్ రోడ్డుతో కూడిన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎండీఆర్ ప్లాన్ కింద రూ.8 కోట్లు మంజూరు చేయించారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి ప్రభుత్వం మారడంతో ముందుకు సాగలేదు. అనంతర కాలంలో వంతెన పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీనివల్ల దండిగాం, కురుకూటి, సొంపిగాం, డెన్సరాయి తదితర పంచాయతీల్లోని సుమారు 20కిపైగా గిరిజన గ్రామాల ప్రజలు వర్షాకాలం సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సువర్ణముఖి నది దాటుతున్నారు. సాలూరు మండలంలోని పెద్దపారన్నవలస గ్రామంలోని కూరగెడ్డపై కూడా నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

తుఫాన్ వర్షాలతో పాచిపెంట మండలం వేటగానివలస పెద్దగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. ఇటుగా ఆరు పంచాయతీలు, 72 గ్రామాలకు చెందిన సుమారు 13,200 మంది నివాసం ఉంటున్నారు. ఈ మార్గం ద్వారానే నిత్యం ప్రజలతో పాటు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటుగానే అరకు కూడా చేరుకుంటారు. వర్షాకాలంలో గెడ్డ ప్రవాహం పెరిగి రాకపోకలకు కష్టతరంగా మారుతుంది. అత్యవసర సమయంలో 108 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. దీనికి ఈ చిత్రమే సాక్ష్యం.





సాలూరు మండలం పెద పారన్నవలస గ్రామంలో కూరగెడ్డపై స్థానికులు ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనపై వెళ్తున్న విద్యార్థులు

జిల్లా ఆస్పత్రిలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం ప్రారంభించారు. నీతి ఆయోగ్ ప్రాజెక్ట్ బృందం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా బ్రెయిన్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని ప్రసారం చేసి కార్యాచరణ అంశాలపై వివరించింది. జిల్లా ఆస్పత్రి నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ అధికారులు ఆన్‌లైన్ ప్రెజెంటేషన్‌ను వీక్షించారు. బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లో అందుబాటులోకి రానున్న సేవలపై జిల్లా ఆస్పత్రి వైద్యబృందంతో వారు చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవన ప్రపంచంలో మానవుని జీవనశైలి విధానాలు క్రమేణా పలు మానసిక రుగ్మతలు, ఒత్తిడులకు దారి తీస్తున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్ పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల్లో మైగ్రేన్(పార్శ్వ బాధ) కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, అలాగే ఎపిలెప్సీ (ఫిట్స్), ఆటిజం, డిప్రెషన్ కు లోనవ్వడం మొదలగు మానసిక సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమన్నారు. మన జిల్లాకు బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నందున జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డా.నాగభూషణరావు, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. జగన్మోహనరావు, సూపరింటెండెంట్ డా.నాగశివజ్యోతి, సైకియాట్రిస్ట్ డా.రక్షిత, వైద్యాధికారులు డా శ్యామల, డా.కౌశిక్, ప్రజాప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

రైలులో ముమ్మర తనిఖీలు

కొమరాడ: రాయిపూర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ ట్రైన్‌లో అక్రమంగా గంజాయి, నిషేధిత వస్తువులు తరలి వెళ్తున్నాయన్న సమాచారం మేరకు ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్, ఈగల్ టీం తో పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్‌లో రైలులో బుధవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఒడిశా, రాయిపూర్ లాంటి ప్రాంతాల నుంచి గంజాయితో పాటు పలు నిషేధిత పదార్థాలతో అక్రమ వ్యాపారులు ప్రయాణం చేస్తున్నారని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రాయిపూర్ పాసింజర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్,ఈగల్, డాగ్‌స్క్వాడ్

పైడితల్లి జాతర మహోత్సవాల ప్రచార రథం ప్రారంభం

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్ర అంతటా అమ్మవారి పండగను ప్రచారం చేసేందుకు గాను ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్టోబరు 6 సోమవారం తొలేళ్ల ఉత్సవం, 7న మంగళవారం సిరిమాను ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నామన్నారు. ఆలయ ఈఓ కె.శిరీష మాట్లాడుతూ అమ్మవారికి నెలరోజుల పాటు నిర్వహించే పండగ కార్యక్రమాల్లో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకోవచ్చన్నారు. అందుకు తగ్గట్టు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వైవి.రమణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతి

సిరివరలో వైద్యసేవలు



సిరివరలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని కొదమ పంచాయతీ సిరివర గ్రామానికి వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అతి కష్టం మీద చేరుకుని అక్కడ వారందరికీ బుధవారం రక్తపరీక్షలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో బాగుజోల నుంచి సిరివర గ్రామానికి రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అయితే రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో సిరివర గ్రామానికి రక్తపరీక్షలు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది చలకమెండంగి నుంచి 6 కిలోమీటర్ల దూరం కాలినడకన చేరుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అశోక్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అక్కడ 128 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. వారికి ఏడుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు తేలిందని ఎంఎల్‌హెచ్‌పీ అశోక్ తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కురుపాం: కురుపాం సర్కిల్ పరిధిలో ఉన్న జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం దాడులు నిర్వహించగా 20 లీటర్ల సారా కలిగి ఉన్న చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ మురళి పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారాను సప్లై చేసిన వారి వివరాలు సేకరించి వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే పాత కేసులో ముద్దాయి అయిన గుమ్మలక్ష్మీపురం మండలం సవర కోటపాడు చెందిన బిడ్డిక కృష్ణను అరెస్టు చేసి వారిద్దరినీ జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆటో, మ్యాక్సీ క్యాబ్ కార్మికులను ఆదుకోవాలి

- 17న బంద్‌లో కార్మికులంతా పాల్గొనాలి
- ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) సీఐటీయూ పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఆటో మ్యాక్సీ క్యాబ్ రంగ కార్మికులను ఆదుకోవాలని, ఈనెల17న జరిగే బంద్ కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రమణమూర్తి ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు కారణంగా రోడ్డున పడ్డ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వెంటనే ప్రత్యామ్నాయంగా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమలు మూతపడ్డాయని. అందులో ఆటో మ్యాక్సీ క్యాబ్‌లపై జీవనం సాగించే కార్మికులు ఉన్నారన్నారు. నిరంతరం ఈ కార్మికులపై ఆర్టీఏ, పోలీస్ అధికారులు జరిమానాలు వేస్తూనే ఉన్నారన్నారు. తమకు ఓటు వేస్తే వాహనం మిత్రుల కింద పదిహేను వేల రూపాయలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా ప్రయత్నం చేయలేదు సరికదా. ఫ్రీ బస్సు పథకాన్ని తీసుకువచ్చి వారందరినీ రోడ్డున పడేసిన పరిస్థితికి తీసుకు వచ్చిందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేకమంది ఆటో మ్యాక్సీ క్యాబ్ కార్మికులు పస్తులు ఉండడమే కాక మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆటో టాటా మ్యాజిక్ కార్మికులను ఆదుకోవాలని లేకుంటే రానున్న స్థానిక ఎన్నికలలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, పి.ఈశ్వరరావు బి.చిన్నారావు ఏఐఎఫ్‌టీయూ నాయకులు ఎన్.అప్పల రెడ్డి,రెడ్డి నారాయణరావు జి.నారాయణరావు, సీఐటీయూ నాయకులు ఎ.జగన్, బి.తిరుపతి,జె.అప్పారావు, జి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ

- పోస్టర్స్ ఆవిష్కరణ

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సీహెచ్. వెంకటేష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచింది. కానీ విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. ప్రధానంగా జిల్లాలో ఐదేళ్ల క్రితం ఏర్పడిన విజయనగరం, రాజాం, గజపతినగరం డిగ్రీ కళాశాలలకు దిక్కుమొక్కు లేకుండా పోయిందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి డిగ్రీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పలు డిమాండ్స్ సాధన కోసం జరుగుతున్న చలో విజయవాడ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులంతా వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ కృషి చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పోరాటం నిర్వహిస్తామని, దీనికి విద్యాశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, వి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



చలో విజయవాడ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దు

- ఎస్పీ వకుల్ జిందల్ హితవు

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ ఇంజినీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్, ఇతర కళాశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కళాశాలల్లో ర్యాగింగ్ జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు సిబ్బందిని బుధవారం ఆదేశించారు.ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ కొన్ని సూచనలు, ఆపై జాగ్రత్తలను సిబ్బందికి, స్టూడెంట్స్‌కు జారీ చేశారు. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తమ పరిధిలోగల ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఇతర విద్యాలయాలను సందర్శించి, విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని చెప్పారు. సీనియర్ విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల శృతిమించి ప్రవర్తిస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలని సూచించారు. ర్యాగింగుకు పాల్పడిన విద్యార్థులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితంగా అర్ధాంతరంగా చదువు, కెరీర్ నాశనం అవుతాయన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలని హితవు పలికారు.



ఎస్పీ వకుల్ జిందల్

స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా గోపాల్, విజయలక్ష్మి

విజయనగరం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులుగా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మిలు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో నిర్వహించిన ఇంటర్వ్యూకు ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకాగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కంటోన్మెంట్ హై స్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.గోపాల్, విజయనగరం మండలం జొన్నవలస హై స్కూల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని ఎస్.విజయలక్ష్మి లను ఎంపిక చేశారు. గతంలో ఒకే స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఉండగా ఈ ఏడాది నుంచి ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున పురుషుల నుంచి ఒకరు, మహిళా విభాగం నుంచి ఒకరిని ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా ఎంపికైన కె.గోపాల్, ఎస్ విజయలక్ష్మిలను జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటనాయుడు, జి.లక్ష్మణరావులు అభినందించారు.





స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులుగా నియామకమైన గోపాల్, విజయలక్ష్మి

గిరిజన గూళ్లకు నిప్పు

వీరఘట్టం: మండలంలోని పెద్ద గదబవలస పంచాయతీ పరిధిలో గదబవలస కాలనీకి కొద్ది దూరంలో గిరిజనులు వేసుకున్న ఐదు పూరిళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం నిప్పుపెట్టారు. పూరిళ్లన్నీ కాలిబూడిదయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. గదబవలస కాలనీకి సంది మానుగూడకు మధ్యలోని ప్రభుత్వ స్థలాన్ని సంది మానుగూడకు చెందిన గిరిజనులకు ఐటీడీఏ గతంలో డీ పట్టాలు ఇచ్చింది. అదే స్థలంలో గదబవలస కాలనీకి చెందిన కొంత మంది అక్రమంగా గుడెసెలు వేశారు.

దీనిపై పట్టాదారులు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది జనవరిలో తొలగించారు. మళ్లీ గదబవలస కాలనీకి చెందిన కొంత మంది ఈ ఏడాది మార్చి నెలలో ఇక్కడ మరలా గుడెసెలు వేశారు. ప్రస్తుతం వాటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్టు ఎస్ఐ తెలిపారు.